క్లుప్తంగా

ఘనంగా కుంకుమార్చన



నవాబుపేట: మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ దేవాలయంలో కొనసాగుతున్న 16వ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం 108మంది మహిళలు సాముహిక కుంకుమార్చన, హోమం, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. దేవాలయ వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా మంగళహారతి కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, దేవాలయ అధికారి నర్సింహులు, శ్రీకాంత్ శర్మ, విజయభార్గవ్ శర్మ, గోపాల్, ఆంజనేయులు, మల్లేష్, వెంకటయ్య, భీమయ్య, జంగమ్మ, భారతమ్మ, లక్ష్మయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి



నవాబుపేట: కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని సింగిల్‌విండో చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు నర్సింహులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీకి సంబంధించిన క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు నాగిరెడ్డి, పార్టీ మండల ప్రధానకార్యదర్శి ప్రతాప్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, తాహేర్, మాజీ సర్పంచ్‌లు గోపాల్, కృష్ణగౌడ్, కేశవ్, వెంకటేష్, నర్సింహులు, శశిధర్‌రెడ్డి, శ్రీశైలం, నర్సింహులు, నరేష్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

భూత్పూర్: స్థానిక టాటా మోటార్స్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైనట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. వివరాలు.. దివిటిపల్లి డబుల్ బెడ్‌రూం దగ్గర నివాసం ఉంటున్న రెడ్డిపల్లి చిన్నయ్య మంగళవారం ఉదయం భూత్పూర్‌లోని టాటామోటార్స్ దగ్గర ఆటో దిగి హైవే దాటుతున్నాడు. భూత్పూర్ నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో అతడి తలకు, రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. ఎల్‌అండ్‌టీ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకొని చిన్నయ్యను 108వాహనంలో జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. చిన్నయ్య కుమారుడు నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహమ్మదాబాద్: బైక్‌పై వెళ్తున్న ఓవ్యక్తికి ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని కారు ఢీకొని గాయాల పాలైన ఘటన గండేడ్ మండలంలో చోటుచేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. మండలంలోని జానంపల్లికి చెందిన కృష్ణారెడ్డి మంగళవారం మధ్యాహ్నం తన బైక్‌పై నంచర్లగేట్ వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టగా అతడి కుడికాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్సులో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



దేవరకద్ర: 'విద్యా అభివృద్ధి వేదిక' ఆధ్వర్యంలో మండలంలోని పెద్దరాజమూర్ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఆ వేదిక ప్రతినిధులు గ్రామంలోని పాఠశాలను సందర్శించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు బాగా చదువుకోవాలని, దీనికోసం తమ వేదిక సహకారం అందిస్తోందని ప్రతినిధులు సత్యనారాయణ, హేమ చంద్రుడు, బాలుయాదవ్, శివకుమార్ తెలిపారు. పెద్దరాజమూర్, కోయిల్‌సాగర్ స్కూళ్ల హెచ్ఎంలు కవిత, రమేశ్, ఉపాధ్యాయులు శంకర్, వెంకటేశ్వర్లు, పాఠశాల కమిటీ చైర్మన్ మంగమ్మ పాల్గొన్నారు.

ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటుచేయాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రతి జిల్లా కేంద్రంలో ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని జీవీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రవీందర్‌నాయక్ కోరారు. ఈమేరకు మంగళవారం డీటీడీఓ చత్రునాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. జీవీఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం





కలెక్టరేట్‌లో ఆటలు ఆడుతున్న మహిళా ఉద్యోగులు

- అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్
- మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు
- విజేతలకు మహిళా దినోత్సవం రోజున బహుమతులిస్తాం
- మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి జరీనాబేగం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురి అవుతుంటారని, ఆటల పోటీలతో మానసికోల్లాసం లభిస్తుందని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో మహిళా ఉద్యోగుల ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆయా శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు ఈ పోటీలు కొనసాగాయి. ముఖ్యంగా లెమన్ స్పూన్, షాట్ పుట్, స్లో వాక్, మ్యూజికల్ చైర్, బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా శివేంద్ర ప్రతాప్ మాట్లాడుతూ విధినిర్వహణలో ఉన్న ఉద్యోగులు ఆటలు ఆడటంతో ఒత్తిడి నుంచి బయటకు వస్తారన్నారు. మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించడం సంతోషకరమని అన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన మొదటి, ద్వితీయ స్థానంలో నిలిచిన మహిళలందరికీ మహిళా దినోత్సవాన బహుమతులు అందజేయనున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి జరీనాబేగం తెలిపారు.

వేతనాలు ఇప్పించాలని వినతి



రాజాపూర్: మండలంలోని గ్రామాల్లో పనిచేస్తున్న తమకు డిసెంబర్ నుంచి వేతనాలు రావడంలేదని మంగళవారం కారోబార్‌లు ఎంపీఓ(మండల పరిషత్ అధికారి) వెంకట్‌రాములుకు వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలే తమ సమస్యలుగా భావిస్తూ చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. డిసెంబర్ నుంచి వేతనాలు రాలేదని, కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని, తక్షణమే పెండింగ్ జీతాలు ఇప్పించాలని వారు ఎంపీఓకు వేడుకున్నారు. కారోబార్‌లు రాయపల్లి పాశం నర్సింహులు, రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు

దేవరకద్ర: ఇంటర్మీడియట్ విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయని, ప్రతి విద్యార్థి బాగా చదివి పరీక్షలు రాయాలని పేర్కొన్నారు. సరైన సమయానికి పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని, విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలిపారు.

ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు

జడ్చర్ల: కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తిని పోలీసులు అడ్డుకుని అతని ప్రాణాలను కాపాడిన ఘటన మంగళవారం మండలంలోని చర్లపల్లి శివారులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మహేశ్‌కు తన భార్యతో గొడవలు జరుగుతుండటంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన అతడు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. ఆమె వెంటనే హైదరాబాద్‌లో ఉంటున్న మహేశ్ బంధువులకు ఫోన్ చేసి విషయం చెప్పింది. వారు డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక పోలీసులు సత్యపాల్, జనార్దన్ ఫోన్ లోకేషన్ ఆధారంగా మహేశ్ ఉన్న ప్రాంతానికి చేరుకున్నారు. అతడి వద్ద నుంచి పురుగుమందు డబ్బాను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నెలాఖరు వరకు ఏఎంసీ సెలవులోనే!

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఏఎంసీ జె.పవన్‌కుమార్ ఈ నెలాఖరు వరకు సెలవుపై వెళ్లినట్టు సమాచారం. వాస్తవానికి 2023 అక్టోబర్ 12న మహబూబ్‌నగర్‌కు పదోన్నతిపై వచ్చారు. గత ఏడాది సెప్టెంబర్ 31న డిప్యూటేషన్‌పై వనపర్తి జిల్లా కొత్తకోటకు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వెళ్లారు. అక్కడ ఈ ఏడాది జనవరి 31న రెగ్యులర్ కమిషనర్‌గా సైదులు చేరడంతో ఏఎంసీ మహబూబ్‌నగర్‌కు వెనక్కి వచ్చారు. అయితే ఇక్కడి మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డితో పొసగక ఆ వెంటనే సెలవుపై వెళ్లిన విషయం విదితమే. ఈ క్రమంలోనే మంగళవారం తిరిగి ఆయన కార్యాలయానికి వచ్చినా అదే పరిస్థితి ఎదురుకావడంతో ఒకేరోజు విధులు నిర్వహించి మరోసారి దీర్ఘకాలికంగా సెలవు పెట్టడం గమనార్హం.

నేడు సాందీపని ఆవాసం వార్షికోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం బండమీదిపల్లిలోని సాందీపని ఆవాసం 20వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు నారాయణరెడ్డి తెలిపారు. ఆవాసంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనాథ పిల్లలను చేరదీసి వారికి విద్యను అందించి జీవితంలో ఉన్నతస్థితి నిలబబడే విధంగా కృషి చేస్తున్నటువంటి సంస్థ సాందీపని ఆవాసం అని అన్నారు. ఇప్పటికే ఈ సంస్థలో చదువుకున్న విద్యార్థులు ఉద్యోగాలు చేస్తున్నట్లు తెలిపారు. వార్షికోత్సవంలో సమాజపెద్దలు, ధార్మికసంస్థల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల వారు పాల్గొనాలని ఆయన కోరారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- హామీలను నెరవేరుస్తాం
- పరిగి ఎమ్మెల్యే డా. టీ.రామ్మోహన్‌రెడ్డి



షేక్‌పల్లితండాలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డా. టీ.రామ్మోహన్‌రెడ్డి

మహమ్మదాబాద్: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పరిగి ఎమ్మెల్యే డా. టీ.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్కిచెర్వుతండా, బోయగుడిసెలు, నంచర్ల, చౌదర్‌పల్లి, మంగంపేట్, షేక్‌పల్లితండా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. చౌదర్‌పల్లిలో 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేఎం నారాయణ, టీపీసీసీ కార్యదర్శి రాములు, డీసీసీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతిబాయి, రాఘవేందర్‌రెడ్డి, ముకుందం, సతీష్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, లక్ష్మికాంత్, ఈసా తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఏఈ ముతీమ్, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

పాడిరైతులకు పాల బిల్లులు చెల్లించాలి



క్వాలిటీ ఆఫీసర్‌కు వినతి పత్రమిస్తున్న రైతులు

జడ్చర్ల: ప్రతి నెల క్రమం తప్పకుండా సకాలంలో పాల బిల్లులను చెల్లించి పాడి రైతులకు సహకారం అందించాలని పాల ఉత్పత్తిదారుల సంఘం నాయకులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని పెద్ద ఆదిరాల పాల శీతలీకరణ కేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశానికి విజయ డెయిరీ చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ రాజ్‌కుమార్ హాజరయ్యారు. రైతులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తమకు సక్రమంగా బిల్లులను చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పాలలో నాణ్యతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. కల్తీ పాలను అరికట్టేందుకు పరీక్షలను నిర్వహించి ప్రయోగాత్మకంగా వివరించారు. బీఎంసీయూ అధ్యక్షులు రాంలింగారెడ్డి, మేనేజర్ ప్రాణేష్ కుమార్, సూపర్‌వైజర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ విక్రమ్


నవాబుపేట: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. మంగళవారం మండలంలోని పోమాల్ గ్రామంలో రాత్రి ఏర్పాటుచేసిన పోలీసు కళాజాతాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానంగా చిన్నారులకు ఫోన్లు ఇవ్వరాదని, అనుమానిత కాల్స్, మెసేజ్‌లకు సమాధానాలు ఇవ్వకూడదన్నారు. మైనర్లకు బైక్‌లు ఇవ్వరాదని, ఇస్తే తల్లిదండ్రులే బాధ్యులు అవుతారని హెచ్చరించారు. తాగి వాహనాలు నడపటంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశముందన్నారు. గ్రామాల్లో సామాజిక రుగ్మతలను తొలగించేలా ప్రతి విద్యావంతుడు కృషి చేయాలని ఆయన కోరారు.

పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలన

- ఇన్విజిలేటర్లతో పరీక్ష కేంద్ర సూపరింటెండెంట్ల సమావేశాలు



దేవరకద్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ ఊర్మిళ



జడ్చర్లలో పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నంబర్ స్లిప్‌లు టేబుళ్లకు అతికిస్తున్న సిబ్బంది

సాక్షి నెట్‌వర్క్: మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం పలుచోట్ల పరీక్ష కేంద్రాలను అధికారులను పరిశీలించారు. సీసీ కెమెరాలను పరిశీలించిన అధికారులు మాట్లాడుతూ పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా చూడాలని, మాస్ కాపీయింగ్‌కు అవకాశం కల్పించకూడదని హెచ్చరించారు.

- మిడ్జిల్ మండలంలో ఇంటర్ ఫస్టియర్ 196 మంది, సెకండియర్ 169 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య తెలిపారు. పరీక్ష సిబ్బందితో కళాశాలలో సమావేశం నిర్వహించారు.
- నవాబుపేట మండలంలోని యన్మన్‌గండ్ల పరీక్ష కేంద్రంలోని ఏర్పాట్లను పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ మద్దిలేటి, పరీక్షల పర్యవేక్షణాధికారి జయరాంనాయక్ పరిశీలించారు.
- జడ్చర్లలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 1,297 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందుకోసం ఇప్పటికే హాల్‌టికెట్లు జారీ పూర్తయ్యింది. అన్ని కేంద్రాల్లో హాల్‌టికెట్ నంబర్ల స్లిప్‌లను టేబుళ్లకు అతికించారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో ఇన్విజిలేటర్లతో పరీక్ష సూపరింటెండెంట్లు సమావేశాలు నిర్వహించారు.
- దేవరకద్రలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 790 మంది విద్యార్థులు పరీక్షలు రాయడానికి అధికారులు ఏర్పాట్లను చేశారు. ఫస్టియర్ 460 మంది, సెకండియర్ 330 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ప్రిన్సిపాల్ ఊర్మిళ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు మరో ఐదు కళాశాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ పరీక్షలకు హాజరు కానున్నారు.

తపస్ ఆధ్వర్యంలో సంబరాలు



తెలంగాణచౌరస్తా లో సంబరాలు జరుపుకొంటున్న తపస్ నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్కా కొమరయ్య ఎన్నిక కావడంతో మంగళవారం స్థానిక తెలంగాణచౌరస్తాలో తపస్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సునీల్‌కుమార్, ప్రధానకార్యదర్శి బాబునాయుడు, కోశాధికారి రాజమోహన్‌రెడ్డి, తపస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కరుణాకర్‌గౌడ్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

కోయిల్‌కొండ: ఇళ్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించేలా ప్రభుత్వం కృషిచేస్తోందని నారాయణపేట ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అయ్యవారిపల్లిగ్రామంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్న ఈ గ్రామంలో 60 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని 24 మంది కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. మండలంలోని మల్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మద్దెల వాగుపై రూ.2.50 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులతో చెక్‌డ్యాం నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజాగణేష్, ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు జి.రవీందర్, వై.విద్యాసాగర్‌గౌడ్, మోహన్‌రెడ్డి, రవినాయక్, రవియాదవ్, యాదయ్యయాదవ్ పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్ జరగలేదు

జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లిలో ఉన్న ఎస్‌ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురికాలేదని వీసీ మీన చింతమనేని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 20న యూనివర్సిటీలో 27మంది విద్యార్థులు వివిధ కారణాలతో అస్వస్థతకు గురికాగా వారికి చికిత్స అందించగా కోలుకున్నట్లు పేర్కొన్నారు. ఫుడ్ పాయిజ్‌కు గురైనట్లుగా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని అలాంటి వదంతులు నమ్మవద్దని సూచించారు. తమ యూనివర్సిటీలో ఉన్న 1200మంది విద్యార్థులకు ఒకే రకమైన నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు వివరించారు.

వసతిగృహాల్లో అమలు కాని మెనూ

జడ్చర్ల టౌన్: బీసీ బాలుర, బాలికల వసతిగృహాల్లో కొత్త మెనూ అమలు కావటం లేదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్త మెనూ ప్రవేశపెట్టి రెండు నెలలు గడుస్తున్నా నేటికీ ఈ రెండు హాస్టళ్లలో పాత మెనూ అమలు చేస్తున్నారని అన్నారు. మెనూను వెంటనే మార్చి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కలెక్టర్ స్పందించి మెనూ మార్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

'బీసీ జెండా ఎగరాలే'

భూత్పూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ జెండా ఎగరాలని పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని అన్నాసాగర్‌లో బీసీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీసీ కులగణన చేపడతామని, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు చట్టబద్దత కల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. బీసీలు ఏకమై తమ బీసీ అభ్యర్థులు గెలిచేందుకు బీసీ కులాలు ఐక్యం కావాలని హితవు పలికారు. ఆ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటన్న, కరంట్ నర్సింహులు, తిరుపతయ్య గౌడ్, బి. జితేందర్, దేవర శివ, వెంకట్రాములు ఉన్నారు.

రైతు శ్రేయస్సే బీకేఎస్ లక్ష్యం



నవాబుపేట: రైతు శ్రేయస్సే లక్ష్యంగా బీకేఎస్(భారతీయ కిసాన్ సంఘ్) ముందుకు సాగుతుందని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, కార్యదర్శి నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నవాబుపేటలో బీకేఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. భారత దేశం ప్రపంచానికే వివిధ రకాల ఉత్పత్తులు ఎగుమతి చేస్తుందన్నారు. కొన్ని రాష్ట్రాల్లో రైతులకు సరైన చేయూత లేక ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలు పరిష్కరించేందుకు బీకేఎస్ ముందుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పప్పు నరేందర్‌రెడ్డి, జట్టి రాములు, శ్రీరాములు, సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు నర్సింహులు, వెంకటేశ్వరప్ప, బిక్కుమల్ల శ్రీరాములు , సరస్వతీ, రాంమోహన్‌రెడ్డి, నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ సంబురాలు

మిడ్జిల్: బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి విజయం సాధించటంతో మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కొమురయ్య గెలవడంతో చౌరస్తాలో టపాకాయలు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు రాజేశ్వర్, పల్లె తిరుపతి, ఆంజనేయులు, రాహుల్, హనుమంత్, సురేష్, నవీన్ పాల్గొన్నారు.

కోడ్ ఎంట్రీ చేయగానే నగదు మాయం

జడ్చర్ల: 'ఇన్‌స్ట్రాగాంలో డ్రెస్ ఆర్డర్ చేశారు.. డ్రెస్ తీసుకువచ్చాం.. మీకు ఒక కోడ్ పంపిస్తాం.. దాని ప్రకారం ప్రాసెస్ చేయండి' అంటూ సైబర్ కేటుగాళ్లు నేరాలకు పాల్పడ్డారు. వారి చెప్పిన ప్రకారం చేసిన ఓ వ్యక్తి ఖాతాలో నుంచి నగదు మాయమైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. సీఐ కమలాకర్ తెలిపిన వివరాలు.. బాదేపల్లిలోని శ్రీరాంనగర్‌కు చెందిన కళ్యాణ్‌షెట్టి బస్వరాజ్‌కు గతనెల 25న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌చేసి ఓకోడ్‌ను పంపించాడు. అతను చెప్పిన ప్రకారంగా ఆయన భార్య సునీత బ్యాంకు ఖాతాకు లింక్ ఉన్న గూగుల్‌పేలో కోడ్‌ను ఎంట్రీ చేసింది. ఖాతాలో ఉన్న రూ.31,995లు అతడికి బదిలీ అయ్యాయి. దీంతో మోసపోయినట్లు గ్రహించి సైబర్ క్రైంకు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



జడ్చర్ల మండలం గంగాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులైన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం



దేవరకద్ర మండలం చౌదర్‌పల్లిలో..



నవాబుపేట పాఠశాలలో..

సాక్షి నెట్‌వర్క్: మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సాన్ని ఘనంగా జరుపుకున్నారు. జడ్చర్ల మండలం గంగాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో, ఆలూరు ప్రాథమిక పాఠశాలలో, రాజాపూర్ మండలం ఈద్గాన్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత, దేవరకద్ర మండలం చౌదర్‌పల్లిలోని ప్రాథమిక పాఠశాల, నవాబుపేట మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలో స్వ యంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులే తోటి విద్యా ర్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానంచేశారు. విద్యార్థులను హెచ్ఎంలు, టీచర్లు అభినందించారు.

నేడు టెండర్లు

నవాబుపేట: మైసమ్మ దేవాలయంలో టెంకాయల విక్రయానికి సంబంధించిన టెండర్లు బుధవారం నిర్వహిస్తున్నట్లు దేవాలయ అధికారి నర్సింహులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెంకాయల, వాహన పూజ సామగ్రి, పూల దండల విక్రయం టెండర్లకు సంబంధించి పాల్గొనేవారు రూ.4లక్షలు, రూ. 2లక్షలు, రూ.లక్ష డీడీ చెల్లించాలని పేర్కొన్నారు. టెండరు దక్కించుకున్నవారు ఈ నెల 9వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 8వ తేదీ వరకు అనుమతి ఉంటుందని వివరించారు.

ఘనంగా గ్రీన్ డే

మరికల్: మండల కేంద్రంలోని పాఠశాల విద్యార్థులు చూపరులను ఆకట్టుకునేల మంగళవారం ఘనంగా గ్రీన్ డే సందర్భంగా చెట్ల ఆకారంలో ప్రదర్శన చేశారు. విద్యార్థులు ఒక్కొక్కరు చెట్టు ఆకారంలో, వేషధారణతో చెట్ల ప్రాముఖ్యతను వివరిస్తూ నృత్యాలు చేశారు. వర్షాలు రావాలన్నా, మనిషికి కావాల్సిన ఆక్సిజన్ కావాలన్నా చెట్లు నాటడం, పెంచడం ఎంతో అవసరమని పాటల ద్వారా గ్రామస్తులకు, విద్యార్థులకు వివరించారు. అనంతరం వారిన్ని టీచర్లు అభినందించారు.